




వేమూరు..

చైతన్యానికి మారుపేరు

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(గురువారం)
సహారీ (ఉదయం) 4.49 (శుక్రవారం)

- 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు
- బలహీన వర్గాల ఓట్లు కీలకం
- తొలి ఎమ్మెల్యేగా కల్లూరి
- రెండు శాఖలకు యాక్టు తయారీ
- న్యాయవాదులకు కలిసొచ్చిన సెగ్మెంట్
- 15 ఎన్నికల్లో ఐదుగురు న్యాయవాదులదే హవా

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

బ్రాహ్మణ	1700
వైశ్య	5,500
కమ్మ	23,870
రెడ్డి	8,818
కాపు	32, 254
గౌడ	12,268
యాదవ	6,339
పద్మశాలి	6,000
నాయి బ్రాహ్మణ	2,567
రజక	5,106
పల్లెకారు	2,116
సగర	2,150
విశ్వబ్రాహ్మణ	687
ముత్తరాజు	348
వాల్మీకిబోయ	333
వడ్డెర	825
కుమ్మర	2,355
ముస్లిం	7,350
మాల	35,628
మాదిగ	31,920
ఎరుకుల	2,791
యానాది	4,139
లంబాడీ	611

బాపట్ల జిల్లాలోని వేమూరు నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి ప్రతిరూపంగా నిలుస్తోంది. ఇక్కడ గతంలో పోటీ చేసిన వారంతా గొప్ప విద్యావంతులు. దీంతో నేతల ఖిల్లాగా వేమూరు నియోజకవర్గం ఘనత వహించింది. 1955 లో ఏర్పడిన ఈ సెగ్మెంట్ ద్వారా ఇప్పటికి 15 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు చెందింది. ఇక్కడ బలహీన వర్గాల ఓట్లు కీలకం కాగా ఈ నియోజకవర్గం నుంచి ఏ పార్టీ గెలుపొందితే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్న సెంటిమెంట్ ఉంది. 1995లో తొలి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొల్లూరి చంద్రమౌళి రెండు శాఖలకు యాక్టు తయారు చేశారు. ఇప్పటి వరకు ఐదుగురు న్యాయవాదులు పోటీలో విజయం సాధించడంతో పాటు వారికి ఈ సెగ్మెంట్ ఎంతగానో కలిసి రావడం జరిగింది.


యడ్లపాటి వెంకట్రావు


నాదెండ్ల భాస్కరరావు


డాక్టర్ కొడాలి వీరయ్య చౌదరి


ఆలపాటి ధర్మారావు


ఆలపాటి రాజేంద్రప్రసాద్


డాక్టర్ సతీష్ పాల్‌రాజ్


నక్కా ఆనందబాబు


డాక్టర్ మేరుగ నాగార్జున




శరణు రామస్వామి చౌదరి


కల్లూరి చంద్రమౌళి



మొత్తం ఓటర్లు 1,95,756
పురుషుల ఓట్లు 94,875
మహిళల ఓట్లు 1,00,872
ఇతరుల ఓట్లు-9

వేమూరు, మార్చి 27: వేమూరు నియోజకవర్గంలో చరిత్ర కలిగిన అగ్రహార గ్రామాలతో పాటు చోళరాజులకు 400 సంవత్సరాలకు పూర్వపు ఆలయాలున్నాయి. రాజా వెంకటాద్రినాయుడు రాసిచ్చిన ఈనాం భూముల ఆదాయం ద్వారా ఆలయాలు విలసిల్లుతున్నాయి. ఐదు మండలాల్లో రెండు మండలాల పరిధి గ్రామాలు కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్నాయి. పలు లంక గ్రామాలు ఉండటమే కాక 80శాతం పైగా ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్, రబీ సాగుల ద్వారా అనేక పంటలు పండిస్తారు. కళారంగ ప్రాముఖ్యంతో పాటు రాజకీయ, విద్య, పారిశ్రామిక రంగాల్లో ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు. వందలాది మంది విద్యావేత్తలు అమెరికాలో పారిశ్రామిక వేత్తలుగా రాణించడమే కాక ఉన్నత స్థాయిల్లో గుర్తింపు పొందారు. క్రీడా, సినీ రంగ ప్రముఖులు పుట్టిన గడ్డ కూడా. ఇక్కడి నుంచి పలు వాణిజ్య పంటలు రాష్ట్రేతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి.

వేమూరు అసెంబ్లీ పూర్వాపరాలు

పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానంతో 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 1955లో అమర్తలూరు నియోజకవర్గం ఏర్పాటు చేశారు. అమర్తలూరు, వేమూరు, చుం డూరు, చేబ్రోలు మండలాల్లోని కొన్ని గ్రామాలుండేవి. ఈమని నియోజకవర్గం కూడా ఉండేది. ఆ తరువాత దుగ్గిరాల నియోజకవర్గం ఏర్పడి కొల్లూరు ఆ నియోజకవర్గంలో ఉండటంతో పాటు వేమూరు మండలంలోని కొన్ని గ్రామాలు కూడా దానిలో కలిసి ఉండేవి. తదుపరి మార్పుల్లో వేమూరు, కొల్లూరు మండలాలను వేమూరు సెగ్మెంట్‌లో కలిపారు.

1955 నుంచి ఇప్పటిదాకా 15సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఐదుసార్లు, కాంగ్రెస్ ఐ అభ్యర్థి ఒకసారి, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి, స్వతంత్ర పార్టీ అభ్యర్థులు రెండుసార్లు, టీడీపీ అభ్యర్థులు ఐదుసార్లు, వైసీపీ అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. తొలిసారిగా 1955లో గెలుపొందిన కల్లూరి చంద్రమౌళి చట్టాలపై అవగాహన కలిగి మంత్రిగా కొనసాగుతూ నాటి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు స్వతంత్ర ప్రతిపత్తి కోసం శ్రమించారు. ఇంగ్లడ్‌లో అభివృద్ధిని గుర్తించి రాష్ట్రంలో మార్పు కోసం కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 1947లో మద్రాసు ప్రావిన్స్‌లో ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు ఒడి స్సాలోని కొంత భాగం కలిసి ఉండేది. ఆనాడు పెద్దలు చంద్రమౌళి ప్రతిభను గుర్తించి లోకల్ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించారు. 1933లో ఆయన నాదేశం రాజ్యాంగం, పంచాయితీరాజ్ చట్టా న్ని రాశారన్న విషయం గ్రహించి స్థానిక స్వపరిపాలన మంత్రిగా, సహకార రంగ మంత్రిగా బాధ్యతలు ఇచ్చారు. 1952దాకా మంత్రి పదవుల్లో కొనసాగారు. 1960లో దేవాదాయ, రెవెన్యూశాఖలు అప్పగించారు. రాష్ట్రీయ దళిత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బుస్సా నాగరాజు పేరును ప్రకటించారు.

- 1962లో వేమూరు నియోజకవర్గ ప్రారంభ సభ్యుడిగా, స్వతంత్ర అభ్యర్థి వెంకట్రావుపై పోటీ చేసి గెలుపొందారు. తిరిగి రెండు మంత్రి పదవులు కొనసాగించి రెవెన్యూ, దేవాదాయశాఖ చట్టంలో పెను మార్పులు తెచ్చారు. 1965నుంచి జరిగిన 12 ఎన్నికల్లో వేమూరు స్థానం నుంచి మంత్రులైన వారందరూ న్యాయవాదులు కావడం విశేషం. తెనాలి ప్రాంతంలో ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపు పొందిన యడ్లపాటి వెంకట్రావు 1965 మధ్యంతర ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగి ఓటమి పాలయ్యారు. 1967 ఎన్నికల్లో గెలుపొందారు. 1972 ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. 1978లో కూడా గెలుపొంది మంత్రి పదవిని సాధించారు. 1983 ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా నిలబడ్డ నాదెండ్ల భాస్కరరావుతో కాం గ్రెస్ అభ్యర్థిగా పోటీపడ్డ యడ్లపాటి ఓట మి పాలయ్యారు. గెలుపొందిన భాస్కరరావు ముఖ్యమంత్రి అయి వేమూరు సెగ్మెంట్‌కు గుర్తింపు తెచ్చారు. 1985లో టీడీపీ అభ్యర్థి కొడాలి వీరయ్య గెలుపొందారు. 1989లో సీనియర్ న్యాయవాది ఆలపాటి ధర్మరావు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. యడ్లపాటిని ఓడించి మంత్రి అయ్యారు. 1994లో ధర్మరావుపై ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ అభ్యర్థిగా గొప్ప మెజార్టీ సాధించి మంత్రి అయ్యారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి పాల్‌రాజ్‌పై బరిలో దిగిన రాజేంద్రప్రసాద్ ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో న్యాయవాది నక్కా ఆనందబాబు టీడీపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి అయిన మేరుగ నాగార్జునపై గెలుపొందారు. 2014ఎన్నికల్లో ఆనందబాబు వైసీపీ అభ్యర్థిగా నిలబడ్డ నాగార్జునపై మరో సారి విజయం సాధించారు. మంత్రి వర్గ విస్తరణలో క్యాబినెట్ మంత్రిగా ఆనందబాబు పనిచేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి నాగార్జునపై పోటీగా నిలిచిన ఆనందబాబు ఓటమి పాలయ్యారు. నాగార్జున క్యాబినెట్ హోదాలో మంత్రి పదవి దక్కించుకున్నారు. ఈ సెగ్మెంట్ న్యాయవాదులకు ఎంతగా నో కలిసొచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు.

బరిలో అభ్యర్థులు

తాజా ఎన్నికల బరిలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా నక్కా ఆనంద బాబు పేరును ఖరారు చేశారు. వైసీపీ నుంచి సంతనూతలపాడు వైసీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న వరికూటి అశోక్‌బాబుకు వేమూరు స్థానాన్ని ప్రకటించారు. దీంతో వీరిద్దరూ నియోజకవర్గంలో ప్రచారాన్ని కొనసాగించారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1955	కల్లూరి చంద్రమౌళి	కాంగ్రెస్	గరికపూడి జోసెఫ్	సిపిఐ	17,428
1962	కల్లూరి చంద్రమౌళి	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	7,019
1965	శరణు రామస్వామిచౌదరి	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	488
1967	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్	4,797
1972	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	లంకపల్లి రాఘవయ్య	కాంగ్రెస్	1297
1978	యడ్లపాటి వెంకట్రావు	కాంగ్రెస్ ఐ	కొడాలి వీరయ్యచౌదరి	జనతా	506
1983	నాదెండ్ల భాస్కరరావు	స్వతంత్ర అభ్యర్థి	యడ్లపాటి వెంకట్రావు	కాంగ్రెస్	24,645
1985	కొడాలి వీరయ్య చౌదరి	టీడీపీ	పిఎల్‌వి ప్రసాదరావు	కాంగ్రెస్	8,116
1989	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	టీడీపీ	9,827
1994	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	10,194
1999	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	18,947
2004	సతీష్‌పాల్‌రాజ్	కాంగ్రెస్	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	8,776
2009	నక్కా ఆనందబాబు	టీడీపీ	మేరుగ నాగార్జున	కాంగ్రెస్	2,230
2014	నక్కా ఆనందబాబు	టీడీపీ	మేరుగ నాగార్జున	వైసీపీ	2,127
2019	మేరుగ నాగార్జున	వైసీపీ	నక్కా ఆనందబాబు	టీడీపీ	9,999

కోడ్ అమలుకు సహకరించాలి

రాజకీయ పార్టీలతో జిల్లా ఎన్నికల అధికారి

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరని, ఇందుకు 48 గంటల ముందుగా సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితిల్లో, ఆన్‌లైన్ ద్వారా అవకాశం లేని పక్షంలో ప్రత్యక్షంగా దరఖాస్తులను స్వీకరించి అనుమతులను జారీ చేస్తామన్నారు. సీ-విజిల్‌లో వచ్చిన 78 ఫిర్యాదులను ఆర్‌వోలు పరిష్కరించారన్నారు. ప్రైవేటు స్థలాల్లో తాత్కాలిక పార్టీ కార్యాలయాలు ఏర్పాటుకు స్థల యజమాని లేఖతో అనుమతి మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యాలయాల్లో 4 - 8 సైజు ఫ్లెక్సీ, ఒక జెండా మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. కరపత్రాలు, ఆడియో, వీడియో సందేశాలకు సంబంధించి ముందస్తుగా ఎంసీఎంసీ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటిస్తూ ప్రచారాలు నిర్వహించుకోవాలన్నారు.

హోర్డింగులు తొలగించొద్దు

శాశ్వత ప్రాతిపదికన ఉన్న రాజకీయ పార్టీల కార్యాలయాల్లో స్థానిక చట్టాలు, అనుమతుల మేరకు ప్రస్తుతం ఉన్న రాజకీయ ప్రకటనల హోర్డింగులను తొలగించకుండా కొనసాగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయం నుంచి ఆయన నిర్వహించిన వీడియో సమీక్షకు జిల్లా అధికారులు హాజరయ్యారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టంను పటిష్టంగా అమలుపరచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌వోలు రాజకుమారి, కీర్తీ చేకూరి, డీఆర్వో పెద్ది రోజా, రిటర్నింగ్ అధికారులు ఆర్డీవో శ్రీఖర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, నోడల్ అధికారులు వీరాచారి, రఘు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, కమిషనర్

ముగిసిన పది పరీక్షలు

- ఆనందోత్సాహాల్లో విద్యార్థులు
- ఏప్రిల్ ఒకటి నుంచి మూల్యాంకనం



గుంటూరు(విద్య), మార్చి 27: పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఒకేషనల్ విద్యార్థులకు మాత్రం ఈ నెల 30 వరకు పరీక్షలు జరగనున్నాయి. 146 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. రాష్ట్ర పరిశీలకులు పార్వతి, ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో శైలజ తదితరులతోపాటు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రతి రోజు సగటున 40 కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేశారు. ఎక్కడా మాల్ ప్రాక్టీసు, కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు.

ఒకటి నుంచి మూల్యాంకనం..

పది జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభం కానుంది. దాదాపు వెయ్యిమంది సబ్జెక్టు టీచర్లు మూల్యాంకన విధుల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే ఆయా ఉపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఏడాది పెదకాకాని సమీపంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో మూల్యాంకనం జరగనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పుల్లారావు, కూటమి నాయకులు

జగన్ గ్యాంగ్‌ను తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధం

● బీజేపీ ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 27: జగన్, అతడి రౌడీ మూకలను తరిమి కొట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్ని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేటలో బుధవారం బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ప్రత్తిపాటి, జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్‌లు పాల్గొన్నారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం మరింత అభివృద్ధి దిశగా ప్రయాణించాలంటూ వైసీపీ సర్కార్‌ను గద్దె దించటమే లక్ష్యంగా మూడు పార్టీ శ్రేణులు పని చేయాలని ప్రత్తిపాటి పిలుపు నిచ్చారు. గత టీడీపీ పాలనలో రూ.4,500 కోట్ల నిధులతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశామని, అందులో మెజార్టీ వాటానిధులు కేంద్రం నుంచే వచ్చాయని, బైపాస్ రోడ్డు వచ్చినా, అమృత్ పథకం వచ్చినా, టిడ్కో గృహాలు నిర్మించినా, సీసీ రోడ్లు వేసినా, ఎన్‌ఆర్‌జీఎస్ పనులు చేసినా, కేంద్రీయ విద్యాలయం వచ్చినా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తీసుకు వచ్చామని, అదే బాటలో కూటమి తిరిగి అధికారంలోకి వస్తే నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం తోట రాజా రమేష్ మాట్లాడుతూ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్ళాలని పిలుపు నిచ్చారు.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించండి

● టీడీపీ నేతలకు సూచించిన ఆర్వో శ్రీకర్

ప్రత్తిపాడు, మార్చి 27: వలంటీర్ల వద్ద ట్యాబ్‌లు ఉన్నాయి.. ప్రతి కుటుంబానికి సంబంధించి పూర్తి డేటా మొత్తం వారి వద్దనే ఉంది.. నియోజకవర్గంలో నస్పైండైన వలంటీర్లు ఉన్నారు.. పించను డబ్బులు కూడా వారి చేత పంపిణీ చేయించ కుండా ఉండాలంటూ తెలుగుదేశం పార్టీ నాయులు పంచుమర్తి శేషు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్‌ను కోరారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వలంటీర్ల విషయంలో తెలుగుదేశంపార్టీ నాయకులు కోరడంతో ఈ విషయం తన పరిధిలోనికి కాదని, మీ స్టేట్ లీడర్స్ చేత ఎన్నికల కమీషన్‌కు పిర్యాదు చేయించాలని సూచించారు. అలాగే సీ విజిల్ యాప్‌లో కంప్లైట్ చేసిన వారి వివరాలు బయటకు తెలియజేస్తున్నారంటూ శేషు ఆర్వోను ప్రశ్నించారు.

చెక్‌పోస్టులో సీసీ కెమెరాల ఏర్పాటు

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్లటౌన్, మార్చి 27: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, ప్రతి చెక్‌పోస్టులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెక్‌పోస్టుల్లో రూ..6 లక్షల విలువైన 1,904 లీటర్ల లిక్కర్ సీజ్ చేశామన్నారు. అలాగే 2.70 లక్షల నగదు, ఇతర వస్తువులు మొత్తంగా రూ.9.54 లక్షలు సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచామన్నారు. గ్రామాల్లో 635 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. రాజకీయ పార్టీల నేతలు సువిధ పోర్టల్ టెక్నికల్ సమస్యలు మా దృష్టికి తీసుకొచ్చారన్నారు. బీఎస్పీ పార్టీ నేతలు తమకు భద్రత కల్పించాలని కోరారన్నారు. రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్న నలుగురు వలంటీర్లు, ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించామన్నారు. నూతనంగా ఓటు కోసం ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటును వేరే నియోజకవర్గాలకు మార్చుకునే అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు.

పరిశీలన..మమ

● జాయింట్ వెరిఫికేషన్ అంతా జగన్నాటకం
● నది ఒడ్డు నుంచే ఫొటోలు తీసుకొని ముగించిన వైనం
● కొల్లగొట్టింది కోట్లలో.. నామమాత్రంగా అపరాధ రుసుం
● ముడుపుల మత్తులో జోగుతున్న అధికారయంత్రాంగం



కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

కొల్లూరు, మార్చి 27: ఇసుక అక్రమ తవ్వకాలు ఉమ్మడి పరిశీలన అంతా జగన్నాటకంగా మారింది. ఆయా శాఖల అధికారులు బుధవారం నది ఒడ్డు నుంచే ఫొటోలు తీసుకుని పరిశీలన పూర్తయినట్లుగా మమ అనిపించారు.

పెదలంక పరిధిలోని కృష్ణానదిలో సొసైటీ భూములతో పాటు ప్రభుత్వ భూములు, రైతుల భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా గత రెండు నెలలకు పైగా సుమారు 15 నుంచి 20 అడుగుల లోతులో దాదాపు 50 ఎకరాలలో ఇసుకను కొల్లగొట్టారు. మైనింగ్ శాఖ ఈ అక్రమ తవ్వకాలు అడ్డుకోకపోగా గుత్తేదారుల నుంచి భారీగా ముడుపులు తీసుకుని భారీ యంత్రాలతో ఇసుక అక్రమ తవ్వకాలను ప్రోత్సహించారు. ఎలక్షన్ కోడ్ రావడం, ఉన్నతాధికారులు ఎన్‌జీటీ ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారో నివేదిక ఇవ్వాలని కోరడంతో మైనింగ్ అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయించి తమకేమీ తెలియనట్లుగా వ్యవహరిస్తూ జాయింట్ వెరిఫికేషన్ పేరుతో ఇసుక అక్రమ తవ్వకాల పరిశీలనకు తెర తీశారు.

గతంలో రాష్ట్ర ప్రభుత్వం జేపీ వెంచర్స్‌కు ఇసుక తవ్వకాలకు రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు జారీ చేసింది. మైనింగ్ అధికారులు గాజుల్లంక వద్ద కృష్ణానదిలో 4.950 హెక్టార్లలో ఇసుక తవ్వకాలు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. జేపీ వెంచర్స్ గాజుల్లంక వద్ద కృష్ణానదిలో సుమారు 200 ఎకరాల్లో ఇసుకను తవ్వేయడంతో ప్రస్తుతం అక్కడ ఇసుక రేణువు కూడా లేకుండా పోయింది. తదనంతరం రాష్ట్ర ప్రభుత్వం జీసీకేసీ సంస్థకు ఇసుక తవ్వకాల బాధ్యతలు అప్పగించింది. వారు మరొకరికి ఇసుక తవ్వకునేందుకు సబ్‌లీజ్‌కు ఇచ్చారు. సబ్‌లీజు తీసుకున్న వారు గాజుల్లంక పరిధిలో ఇసుక లేకపోవడంతో పెదల్లంక వద్ద ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఉన్న ఇసుక మేటల మీద కన్ను పడింది. దీంతో రైతులకు, సొసైటీ పెద్దలకు నామమాత్రంగా నగదు చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టారు. గత రెండు నెలల్లో 50 ఎకరాల విస్తీర్ణంలో 15 నుంచి 20 అడుగుల లోతులో ఇసుక తవ్వేసి కోట్లలో సొమ్ము చేసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉమ్మడి పరిశీలనకు వచ్చిన అధికారులు తమకేమీ తెలియదన్నట్లుగా దూరం నుంచే కొన్ని ఫొటోలు తీసుకున్నారు. గాజుల్లంక కృష్ణానది నది, జువ్వలపాలెంలోని కృష్ణానది ఒడ్డుకు చేరుకుని అక్కడ కూడా తమకు కావాల్సిన ఫొటోలను సేకరించి పరిశీలన పూర్తయినట్లుగా వెళ్లిపోయారు. భట్టిప్రోలు మండలం ఓలేరులోనూ గత నెల రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వాటిని కూడా మంగళవారం నుంచి నిలుపుదల చేయించిన అధికారులు అక్కడకు కూడా వెళ్లి ఫొటోలు సేకరించి పరిశీలన పూర్తయినట్లుగా వెళ్లిపోయారు. ఉమ్మడి పరిశీలనలో మైనింగ్ శాఖ జియాలజిస్టు ఫణిరాజ్‌కుమార్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ జాన్ ప్రదీప్, భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక నిపుణురాలు వసంతకుమారి, తహసీల్దార్ పుల్లారావు, ఆర్ఐ త్రివేణి, నదీ పరిరక్షణ శాఖ ఏఈ సురేష్‌కుమార్, సబ్ ఎస్ఐ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లగొట్టింది కోట్లలో.. అపరాధ రుసుం లక్షల్లో..

ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా గుత్తేదారులు కోట్లు గడిస్తే మైనింగ్ శాఖాధికారులు మాత్రం కొల్లూరు మండలం గాజుల్లంకలో కేవలం రూ.3 లక్షల అపరాధ రుసుం విధించినట్లుగా మైనింగ్ శాఖ ఏడీ రాజేష్‌కుమార్ సోమవారం ఓ దినపత్రికకు ప్రకటన ఇచ్చారు. జాయింట్ వెరిఫికేషన్ కోసం బుధవారం ఆయా శాఖల అధికారులు పరిశీలనకు వస్తే ఏడీ మాత్రం ఎటువంటి కొలతలు లేకుండా ఎంత విస్తీర్ణంలో అక్రమంగా తవ్వేశారో తెలియకుండా, ముందుగానే ఏమీ పరిశీలించకుండానే అపరాధ రుసుం ప్రకటించడం వెనుక మర్మమేమిటో ఆయన చెప్పాల్సి ఉంది. గత రెండు మూడు నెలలుగా గాజుల్లంక పరిధిలో ఇసుక లేకపోవడంతో గుత్తేదారులు పెదల్లంక పరిధిలో అక్రమ తవ్వకాలు సాగిస్తే మైనింగ్ ఏడీ మాత్రం గాజుల్లంక పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లుగా చెబుతూ నామమాత్రంగా అపరాధ రుసుం విధిస్తే, మళ్లీ కొల్లూరు మండలంలోని పెదలంక, గాజుల్లంక, జువ్వలపాలెం గ్రామాల పరిధిలో ఇసుక రీచ్‌లను బుధవారం ఉమ్మడి పరిశీలన బృందం ఎందుకు వచ్చిందో వారికే తెలియాలి. వారు కూడా ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయో తెలియకుండానే, ఎటువంటి కొలతలు వేయకుండానే తూతూ మంత్రంగా పరిశీలన చేసి వెళ్లిపోవడం గమనార్హం. ఫిబ్రవరి 7వ తేదీన గ్రీన్ ట్రిబ్యునల్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 42 ఇసుక రీచ్‌లలో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం యంత్రాలతో ఇసుక తవ్వకాలు నిషేధిస్తూ కూలీలతో ఇసుక తవ్వకాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ ఎక్కడా అమలు చేయకపోవడంతో ప్రస్తుతం ఇసుక అక్రమ తవ్వకాలపై తీసుకున్న చర్యలు గురించి మళ్లీ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించడంతో ఓలేరు, పెదలంక పరిధిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను ఎట్టకేలకు మైనింగ్ అధికారులు నిలుపుదల చేయించి తమకేమీ తెలియదన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

అందుకే జగన్‌ను ఓడించాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



విలేకరులతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, మార్చి 27: దాదాపు ఎనభైశాతం శాతం హామీలు ఎగ్గొట్టినందుకు జగన్ పార్టీని ఓడించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. మద్యనిషేదం హామీపై మాటతప్పి మడమ తిప్పాడని, నాసిరకం మద్యం పోసి 35 లక్షల మంది ఆరోగ్యాల్ని నాశనం చేశారని, లివర్, కిడ్నీలు చెడిపోయి 30 వేల మంది ప్రాణాలు పోయి వారి భార్యల మాంగల్యాలు మంటగలిపి నందుకు జగన్‌పార్టీని ఓడించాలన్నారు. విద్యుత్ చార్జీలు 9 సార్లు పెంచి రూ.64 వేల కోట్లు భారం మోపాడని, నిరంతర కరెంట్ కోతలతో ప్రజలను తీవ్రంగా అల్లాడిస్తున్నాడన్నారు. స్మార్ట్‌మీటర్లు, వ్యవసాయ మోటార్లకు మీటర్ల కొనుగోళ్ళలో రూ.15 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. 2.30 లక్షల ఉద్యోగాల భర్తీపై మాట తప్పాడు, మోగా డీఎస్సీని దగా డీస్సీ చేశాడని, ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ హామీకి మడమ తిప్పాడన్నారు. ప్రాజెక్టులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తానన్న హామీపై మాట తప్పాడని, పోలవరం నిర్వాశితులకు రూ.19లక్షలు ఇస్తానన్న హామీపై మాట తప్పాడని విరుచుకుపడ్డారు. కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ క్రమబద్దీకరి స్తానన్న హామీపై మాట తప్పాడన్నారు. ఇలా 85శాతం హామీలు అమలు చేయకుండా 99శాతం చేశానని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి

విధుల నుంచి తొలగింపు

● ఆంధ్రజ్యోతికి స్పందన

మాచర్లటౌన్, మార్చి 27: పురపాలక సంఘంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసరావును విధుల నుంచి తొలగిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. వాటర్ సప్లయి విభాగంలో ఎలక్ట్రికల్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వైసీపీ ప్రచారంలో పాల్గొన్నట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ వెంకటదాసు విచారణ జరిపి శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించారు.

ఇద్దరు వలంటీర్లను కూడా.. అలాగే ఇరువురు వలంటీర్లు కోట రాజేష్, కందుకూరి మధులను కూడా విధులు నుంచి తొలగించినట్లు కమిషనర్ వెంకటదాసు చెప్పారు. వీరు బ్యాంకుకాలనీ సచివాలయం, కోర్టు బజారు సచివాలయాల్లో వలంటీర్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వైసీపీకి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నందున ఫ్లయింగ్‌స్క్వాడ్ నివేదిక ఆధారంగా విచారణ జరిపి విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు.



పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న భాష్యం హనుమంతురావు

కేజేఎస్ఎస్ సేవలు అభినందనీయం

● భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావు
● నూతన భవనసముదాయానికి రూ.50 లక్షల భారీ విరాళం

గుంటూరు(తూర్పు), మార్చి27: పేద బాలికల విద్యను ప్రోత్సహిస్తూ వారికి అండగా నిలిచిన కమ్మజన సేవాసమితి సేవలు అభినందనీయమని భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు అన్నారు. గుంటూరు, జేకేసీ రోడ్డులో నిర్మిస్తున్న కమ్మ బాలికల వసతి గృహానికి భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ రూ.50 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. బుధవారం కేజేఎస్ఎస్ పాలకవర్గ సభ్యులకు భాష్యం హనుమంతురావు ఆ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాతలకు పేద విద్యార్థినులకు మధ్య వారధిలా కమ్మజన సేవాసమితి పనిచేస్తుందని కొనియాడారు. నూతన భవన సముదాయంలో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. సమితి అధ్యక్షులు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ భారీవిరాళాన్ని అందజేసిన భాష్యం రామకృష్ణను మన స్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు ఘంటా పున్నారావు, భాష్యం రామకృష్ణ కుమారుడు భాష్యం సాకేత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దొంగలు అరెస్టు

● ఎనిమిది ద్విచక్రవాహనాలు, కారు స్వాధీనం

భట్టిప్రోలు, మార్చి26: వాహనాల దొంగల ముఠా ను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 8 బైక్‌లు, 1 ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు రేపల్లె డీఎస్పీ టీ.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం భట్టి ప్రోలు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడిస్తూ.. పల్నాడుజిల్లా బొల్లాపల్లి మండలానికి చెందిన నలుగురు భట్టిప్రోలు పరిసర గ్రామాల్లో ఇన్నోవా కారులో సంచరిస్తూ మోటార్ సైకిళ్ళను దొంగిలించుకుపోతున్నారు. అలాగే కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం, భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు 2 బైక్‌లను దొంగిలించారన్నారు. ఈ దొంగలను అదుపులోకి తీసుకొని వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన భట్టిప్రోలు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, ఇతర సిబ్బందికి రివార్డు నిమిత్తం ఎస్పీకి రిపోర్టు చేయ నున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో వేమూరు సీఐ పి. రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



బీసీ డిక్లరేషన్‌కరపత్రాలు ఆవిష్కరిస్తు, యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీతోనే బీసీలకు న్యాయం

● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి27: గతంలో టీడీపీ హయాంలో బీసీలకు గుర్తింపు, గౌరవం, పదవుల కేటాయింపులో న్యాయం జరిగిందని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీసీడిక్లరేషన్ కరపత్రాలను యరపతినేని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీలపై దాడులు, హత్యలు పెరిగిపోయాయన్నారు. బీసీలకు 34శాతం రిజర్వేషన్లు టీడీపీ తీసుకురాగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక 10శాతం రిజర్వేషన్లను తగ్గించటం వలన రాష్ట్రంలో ఎందరో బీసీలు పదవులకు దూరమయ్యారని చెప్పారు. బీసీల కార్పొరేషన్ నిర్వీర్యం చేయటంతో రాష్ట్రంలో ఆర్థిక వెనుకబాటుకు గురయ్యారన్నారు. ముందుగా టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘ సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి నివాలర్పించారు. కార్యక్రమంలో తురక వీరాస్వామి, సయ్యద్ అమీర్‌ఆలీ, గండికోట వెంకటేశ్వర్లు, వలేపు రామకృష్ణ, బత్తుల శ్రీను, షేక్ ఖాసిమ్‌సైదా, చింతల అజయ్, నాగరాజు, యర్రగని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త

బలసానికి షోకాజ్ నోటీస్

ప్రత్తిపాడు వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్ తెలిపారు. ఇటీవల వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో పాటు అక్కడ జరిగిన గొడవల నేపథ్యంలో కిరణ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఆర్వో తెలిపారు. అక్కడ జరిగిన గొడవకు సంబంధించి అందరినీ బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావలి ప్రకారం ఏదైనా రాజకీయ పార్టీ నాయకులు ప్రచారాల్లో నింబంధనలు ఉల్లంగిస్తే ఆ ప్రచారానికి సంబంధించి పర్మిషన్ తీసుకున్న వారే బాధ్యులవుతారని శ్రీకర్ తెలిపారు.



కోనఫలంలో శంఖారావ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

వైసీపీని ఓటు ద్వారా తరిమికొట్టాలి

● రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మార్చి 27: వైసీపీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసేందుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీఓటు హక్కు ద్వారా తరిమికొట్టాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం గరువుపాలెం గ్రామంలో కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్ళ కాలంలో అవినీతి అరాచకాలే తప్పా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు పావలా ఇచ్చి జగన్ అండ్ కో దోచుకుతిన్నారన్నారు. సామాన్య ప్రజలపై అధికబారం మోపి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించారన్నారు. రాష్ట్రంలో విపరీతంగా యువతను నాశనం చేసే విధంగా గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు చేస్తున్నారన్నారు. ఏటా విడుదల చేసి ఉద్యోగాలు కల్పిస్తామన్న జగన్ ఐదేళ్ళలో ఒక్క జనవరిలో కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. పూజారిపై వైసీపీ నాయకులు దాడి చేసి హేయమైన బూతులు తిట్టటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, గూడపాటి శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసరావు, కొలసాని రాము, తదితరులు పాల్గొన్నారు.

తరగతులు, పరీక్షలను

5వ సెమిస్టర్‌లోనే నిర్వహించాలి

పెదకాకాని, మార్చి 27: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెండేళ్లుగా బీఏ, బీకాం, బీబీఏ విద్యార్థులకు 5వ సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్, ఆరో సెమిస్టర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారని వారికి ఐదవ సెమిస్టర్‌లోనే తరగతులు పరీక్షలు నిర్వహించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. బుధవారం విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. నాగరాజు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు

వైసీపీ అరాచక పాలన పోవాలి

● 1562 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 27: అమరావతికి వెలుగు, పూర్వవైభవం కలగాలంటే వైసీపీ అరాచకపాలన పోవాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజధాని కొన్ని గ్రామాలలో ఇళ్ల వద్ద నుంచి నిరసన దీక్షలు జరుగుతున్నాయి. బిల్డ్ అమరావతి అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1562 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మహిళలు మాట్లాడుతూ విజనరీ ఉన్న నాయకుడిని ఎన్నుకుంటే రాష్ట్ర బాగుపడుతుందన్నారు. మూడు రాజధానులతో రాష్ట్రాన్ని సీఎం జగన్‌రెడ్డి సర్వనాశనం చేశాడని ఆరోపించారు. మహిళలని చూడకుండా శాంతియుతంగా ఉద్యమం చేస్తుంటే పోలీసులతో కొట్టించి బూటుకాళ్లతో డొక్కలో తన్నించారన్నారు. న్యాయం చేయమని నిలదీస్తే అక్రమ కేసులు పెట్టి జైల్లో పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీష్ పాలన కన్నా దారుణంగా రాష్ట్ర రాజధానికి భూములిచ్చిన రైతుల పట్ల జగన్‌రెడ్డి వ్యవహరించారన్నారు. బిల్డ్ అమరావతి , జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో మూడు రాజధానులకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి.

14న ఫర్టిలైజర్స్, సీడ్ డీలర్స్ అసోసియేషన ఎన్నికలు

గుంటూరు సిటీ, మార్చి 27: ఆంధ్రప్రదేశ్ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్, సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఏప్రిల్ 14న జరగనున్నాయని రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని అరండల్ పేటలో ఉన్న ఫర్టిలైజర్స్ అండ్ ఇన్సెక్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఎన్నికల కార్యక్రమం జరుగుతుందని వెంకట నాగిరెడ్డి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

1,10,908 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,14,185 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,10,908 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 83,570 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000
నెంబరు. 5	10000	17000
273	9500	21000
341	9000	19500
4884	10000	16000
సూపర్ 10	10000	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21500
బ్యాడిగి	9000	20000
దేవనూరు డీలక్స్	9000	18500
తెల్లకాయలు	5000	12000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పార్టీలో చేరిన వారితో మొహమ్మద్ నసీర్

మైనార్టీల పక్షపాతి చంద్రబాబు

● టీడీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనార్టీల పక్షపాతి ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబేనని టీడీపీ తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని లాలాపేట అహ్మద్ నగర్‌కు చెందిన 100 మంది వైసీపీ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు పెమ్మసాని రవి వారికి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమంపై చంద్రబాబు చిత్తశుద్ధిని ముస్లింలు గ్రహిస్తున్నారని, అందుకే పెద్ద సంఖ్యలో వారు టీడీపీలోకి చేరుతున్నారని చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు అన్ని విధాలా మేలు జరిగిందని, సంక్షేమ పథకాలు అందాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నేతలు అబ్దుల్ సలీమ్, హఫీజ్, పార్టీలో చేరిన వారిలో జానీబాషా, ఖాజా, అబ్దుల్ ముజీబ్, అహ్మద్ బాషా, గఫార్, రఫీ, నౌషాద్, సుఫియా, సోహెల్ తదితరులు ఉన్నారు.

'గుంటూరు తూర్పు'లో అభివృద్ధి జరగాలంటే కూటమి గెలవాలి

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి గెలవాలని తూర్పు కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని 8వ డివిజన్ కుమ్మరి బజారులో బుధవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ కూటమికి ఓటు వేసి ప్రతి ఒక్కరూ రాష్ట్ర భవిష్యత్తు, రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జ్యోతుల జస్వంత్, జాగర్లమూడి శ్రీనివాస్ రావు, శ్రీను నాయక్, అంకమ్మరావు, పఠాన్ అతవుల్లా, కొలగాని సుబ్బారావు, ఇలాహి, భాస్కర్ పృథ్వి రాజ్, మణికంఠ జనసేన నాయకులు జడ సురేష్ తదితరులు పాల్గొన్నారు

పవన్ కల్యాణ్ నాయకత్వానికే ప్రజల మద్దతు

● జనసేన పార్టీలో భారీగా చేరికలు

గుంటూరు, మార్చి 27 : స్వచ్ఛమైన, నీతివంతమైన పాలన జనసేనాని పవన్ కల్యాణ్‌తోనే సాధ్యమని, రాష్ట్రవ్యాప్తంగా పవన్ నాయకత్వానికి ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతున్నారని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ తెలిపారు. కాకానిరోడ్‌లోని పార్టీ నగర కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వీర మహిళ ఆషా, రెల్లి నేత సోమి ఉదయ్‌కుమార్, బొందిలి నాగేంద్ర సింగ్ ఆధ్వర్యంలో ముస్లీం మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి నేరెళ్ల సురేష్ పార్టీ కండువా వేసి సాదరంగా జనసేనలోకి ఆహ్వానించారు. వైసీపీ నాయకులు గజదొంగల మాదిరిగా రాష్ట్రంపై పడి దోచుకోవడం చూసి ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని, ఈ ఎన్నికల్లో వైసీపీకి ఘోర ఓటమి తప్పదని నేరెళ్ల సురేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చింతా రేణుక రాజు, మాదాసు శేఖర్, వీ రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో నేరెళ్ల సురేష్

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

గుంటూరు(లీగల్), మార్చి 27: గుంటూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు గురువారం పోలింగ్ జరగనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రాజకీయ పార్టీలు ప్రత్యక్షంగా ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులను ప్రకటించాయి. అధ్యక్ష పదవికి టీడీపీ, జనసేన, బీజేపీ లీగల్ సెల్ నుంచి యంగలశెట్టి శివసూర్యనారాయణ (బబ్లూ) పోటీలో ఉన్నారు. ఈయనకు మాజీ ఏపీపీ కాసు వెంకటరెడ్డి పోటీ అభ్యర్థిగా ఉన్నారు. కాసు వెంకటరెడ్డి గత ఏడాది సురేష్ చేతిలో 35 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఉపాధ్యక్ష పదవికి ఏపీ లాలి, మాలే దేవరాజు, చింతా రామకోటిరెడ్డి, బీవీ గౌరీశంకర్‌లు పోటీలో ఉన్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి గురజాల అనూరాధ, లక్కీ సుబ్బయ్య, యారసాని అజయ్‌కుమార్, మోదుకూరి శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారు. సంయుక్త కార్యదర్శి పదవికి ఇల్లూరి విజయ్‌వర్మ, కట్ట నరసింహం, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి పదవికి సయ్యద్ ఇస్మాయిల్, పూదోట రాజేష్‌లింగం, గండికోట శేషగిరిరావు పోటీలో ఉన్నారు. కోశాధికారి పదవికి కాలే దేవదాసు, మేడికొండు మల్లికార్జునరావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి పల్లే నరసింహరావు, బొప్పా శ్రీనివాసరావు పోటీ పడుతున్నారు. లేడీ రిప్రజెంటేటివ్ పదవికి కూనిశెట్టి ప్రమీల, నాలుగు సీనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు పసుమర్తి అంకమ్మరావు, కొమ్మినేని చంద్రశేఖర్, కొమ్మా రమేష్, ఎస్‌బీపీ రూన్సీ, లేడీ ఎగ్జిక్యూటివ్ పదవికి పులి ప్రత్యూష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడు జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు షేక్ మస్తాన్‌వలి, తోట నాగసాయిరాం, బర్మా రాజశేఖర్, షేక్ రిహానాబేగం(రిహాన), రాయపూడి శ్రీనివాసరావు(గుండు శ్రీను), మొర్ల వెంకటకృష్ణ పోటీ పడుతున్నారు. పోలింగ్ అనంతరం ఆ వెంటనే ఓట్ల లెక్కింపు జరిపి రాత్రికల్లా ఫలితాలను వెల్లడిస్తామని అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు, ఎన్నికల అధికారి కేవీకే సురేష్ తెలిపారు.

కూటమి అభ్యర్థులు వీరే..

గురువారం జరుగుతున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి లీగల్ సెల్‌ల నుంచి పోటీలో ఉన్న ఉమ్మడి అభ్యర్థులను మంగళవారం ప్రకటించారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు చుక్కపల్లి రమేష్, రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు బ్రహ్మేశ్వరరావు, దొడ్డాల కోటేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు అమ్మినాయుడు, బీజేపీ రాష్ట్ర నాయకులు జూపూడి రంగరాజు, చంద్రశేఖర్, బీఎస్ఆర్ కృష్ణ ప్రసాద్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గూడూరు రాంబాబు పాల్గొన్నారు. కూటమి అభ్యర్థులుగా అధ్యక్ష పదవికి యంగలశెట్టి శివసూర్యనారాయణ(బబ్లు), జనరల్ సెక్రటరి పదవికి గురజాల అనురాధ, జాయింట్ సెక్రటరి పదవికి ఇల్లూరి విజయ్‌వర్మ, ట్రెజరర్ పదవికి కాలే దేవదాసు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి బొప్ప శ్రీనివాసరావు, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి పదవికి గండికోట శేషగిరిరావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులకు బర్మా రాజశేఖర్, మొర్ల వెంకటకృష్ణలను ఉమ్మడి అభ్యర్థులుగా బలపరుస్తున్నట్టు నాయకులు ప్రకటించారు.

యువతకు క్రీడలపై అసక్తి పెంపొందించాలి

గుంటూరు(విద్య), మార్చి 27 : యువతలో క్రీడలపై ఆసక్తి పెంపొందించాలని జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి వైవీఎస్‌బీజీ పార్థసారథి సూచించారు. స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు, శారీరక సమతౌల్యత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ మధుసూదనరావు, ప్రిన్సిపల్ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మాడి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి హేయం

గుంటూరు, మార్చి 27: కాకినాడ శివాలయంలో అర్చకులు సాయి శర్మ, విజయ్ కుమార్ శర్మలపై దాడికి దిగిన వైసీపీ మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావును వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఏపీ అర్చక జేఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి డిమాండ్ చేశారు. తక్షణమే చంద్రరావును అరెస్ట్ చేయాలన్నారు.

తీరు మార్చుకోని వలంటీర్లు

● జగన్ పర్యటనల ఫొటోల పోస్టింగ్
● సచివాలయాల వాట్సాప్ గ్రూపుల్లో షేర్
● స్ర్కీన్ షాట్లు తీసి ఈసీకి ప్రతిపక్షాల ఫిర్యాదు



సచివాలయ వాట్సాప్ గ్రూపులో సీఎం జగన్ మేమంతా సిద్ధం సభ పోస్టులు

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా జిల్లాలో పలువురు గ్రామ/వార్డు సచివాలయాల వలంటీర్లు తమ తీరు మార్చుకోవడం లేదు. బుధవారం నుంచి సీఎం జగన్ ఎన్నికల ప్రచారాన్ని మేమంతా సిద్ధం పేరుతో ప్రారంభించగా దానికి సంబంధించిన ఫొటోలు, వీడియో క్లిప్పులు, సందేశాలతో పలువురు వలంటీర్లు సచివాలయాల వాట్సాప్ గ్రూపుల్లో ప్రజలకు షేర్ చేశారు. తమ పేరుతో పోస్టింగ్ పెడితే దొరికిపోతామనే భయంతో చేదోడు క్యాంపెయిన్ పేరుతో గ్రూపు అడ్మిన్‌గా చేర్చి ఆ పేరు నుంచి పోస్టింగ్‌లు పెట్టడం ప్రారంభించారు. వీటిని ప్రతిపక్షాలకు చెందిన పలువురు స్ర్కీన్ షాట్లు తీసి ఎన్నికల సంఘానికి పంపారు. వైసీపీ నేతలు ఏర్పాటు చేస్తున్న సమావేశాలకు, వారి వెంట ప్రచార కార్యక్రమాలకు వెళుతున్న వలంటీర్లను తొలగిస్తున్నా మార్పు రావడం లేదు. సస్పెండ్ చేసినా తమకేమీ కాదన్న ధోరణిలో వారున్నట్లు అర్థమవుతుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నీటి సరఫరాలో అంతరాయం, ఆస్తి పన్నుల చెల్లింపు వంటి వాటి కోసం వలంటీర్లు క్లస్టర్ల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. అయితే వాటిని ఇప్పుడు వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. వలంటీర్లు కొంతమంది తెలివిగా ఈ గ్రూపుల్లో గృహసారథులను కూడా చేర్చి వారిని అడ్మిన్‌లుగా చేశారు. దాంతో ఒక్కో గ్రూపునకు 15 నుంచి 20 మంది అడ్మిన్‌లు తయారయ్యారు. వీరిలో ఎవరైనా ఆ గ్రూపులో పోస్టింగ్ చేసే అవకాశం ఉండటంతో వలంటీర్లు తెరవెనుక ఉండి కథ నడిపిస్తున్నారు.

వాట్సాప్ గ్రూపులను తొలగించాలి

జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో ఉన్న వాట్సాప్ గ్రూపులను ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు తొలగించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. కలెక్టరేట్‌లో టెక్నికల్ విభాగం ఉన్నందున ఏవైతే సచివాలయాల నుంచి ఈ వాట్సాప్ గ్రూపులను ఆపరేట్ చేస్తున్నారో వాటిని తొలగించడంతో పాటు ఆ గ్రూపులో ఉన్న వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వర్తించాలి : కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 27: సార్వత్రిక ఎన్నికల్లో విధులు కేటాయించబడిన ప్రతి అధికారి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అందుబాటులో ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో నోడల్, ఇంజినీరింగ్ అధికారులు, సూపరిండెంట్ లతో ఎన్నికల నిర్వహణ, విధుల కేటాయింపుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఈలు అందరూ ఈవీఎంల పనితీరు, వీవీప్యాట్ ల కనెక్షన్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, ఎస్ఈ శ్యాం సుందర్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, సూపరిండెంట్లు, ఈఈలు పాల్గొన్నారు.

4 రోజుల్లో ముగియనున్న వడ్డీ రాయితీ గడువు

రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 4 రోజులు మాత్రమే ఉన్నందున పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా సెలవు రోజుల్లో కూడా జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140, పెద్దపలకలూరురోడ్‌లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్‌లోని 148 వార్డ్ సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయన్నారు.

రంగస్థల పురస్కారాలు ప్రదానం

గుంటూరు(తూర్పు), మార్చి 27 : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ రంగస్థల నటులకు సత్కార సభ జరిగింది. సభకు కళపత్రిక డైరక్టర్ డాక్టర్ మహమ్మద్ రఫీ అధ్యక్షత వహించారు. అతిథులుగా టీడీపీ నాయకుడు మన్నవ సుబ్బారావు, కళాపోషకులు ఘంటా పున్నారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య తదితరులు పాల్గొని ప్రముఖ రంగస్థల నటుడు ఆకురాత్రి భాస్కరచంద్రకు గురజాడ పురస్కారంతో, కత్తి శ్యాంప్రసాద్‌కు బళ్ళారి రాఘవ పురస్కారంతో, డాక్టర్ రాయల్ హరిశ్చంద్రకు సిఎస్ఆర్ పురస్కారంతో, షేక్ హుస్సేన్‌కు గరికపాటి రాజారావు పురస్కారంతో, డాక్టర్ సురభి నిరుపమకు పనారస గోవింతరావు పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభానంతరం ట్రీట్‌మెంట్ హాస్యనాటిక ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సయ్యద్ జాని బాషా, డి.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ తెలుగు జాతి ఆణిముత్యం

గుంటూరు, మార్చి 27 : అంచలంచెలుగా గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన హీరో రామ్‌చరణ్ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేశారని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ వి.మాణిక్యలరావు ప్రశంసించారు. బుధవారం రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు నిర్మల్ హృదయ్‌లో మానసిక వికలాంగుల సమక్షంలో ఘనంగా జరిగాయి. అక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి నిత్యావసర వస్తువులను అందజేశారు. విశ్రాంత రిజిస్ట్రార్ మాణిక్యాలరావు, ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు తదితరులు మాట్లాడుతూ రామ్‌చరణ్ సినీ ప్రస్థానం, అతడు ఎదిగిన తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు గిడుతూరి సత్యం, ఆళ్ల హరి, వంగా శ్రీనివాసరావు మాస్టారు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల నిబంధనావళి : ఈదర వీరయ్య

గుంటూరు, మార్చి 27 : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కార్యాలయ నియమావళి ప్రకారం పని చేయాలని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి ఉదయం 10.30 గంటలకు ఆఫీసుకు రావాలని, పై అధికారి చెప్పినట్లు వినాలని సూచించారు. ఈ విషయాన్నింటిని క్రోడీకరించి డీఓఎం (డిస్ట్రిక్ట్ ఆఫీస్ మాన్యువల్)గా రూపొందించిన శిల్పి టోటెన్ హోం అనే బ్రిటీష్ అధికారి ఈయన పేరుననే పరిపాలనా విధానాన్ని టోటెన్ హోం ఆఫీసు సిస్టిమ్‌గా నేటికీ పిలుస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంఖ్య 1825 సాధారణ పరిపాలనా శాఖ తేదీ 26.12.1953 ద్వారా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు పరిచేందుకు నిర్ణయించింద న్నారు. డీఓఎంలో మొత్తం 143 పేరాలు ఉన్నాయన్నారు. ప్రతి పేరాలో ఒక్కొక్క విషయాన్ని చర్చించి ప్రభుత్వ కార్యాలయం ఏ విధంగా పని చేయాలనే విధి విధానాలను సమగ్రంగా పొందుపరిచారన్నారు. ఉద్యోగులు దీని ప్రకారం ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని దినాలను కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. హాజరు విషయంలో సెక్షన్ అధికారి తన కింది ఉద్యోగులకు ఆదర్శప్రాయంగా మెలగాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల మధ్య అర్ధగంట మాత్రమే భోజన విరామం తీసుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి తాము పనిచేసే కార్యాలయం శుచి, పరిశుభ్రతను కాపాడాలన్నారు. తన బాధ్యతలను హుందాగా నిర్వహించాలన్నారు. ఏవైనా ప్రత్యేక ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారికి తెలియజేయాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన పేపర్స్‌గాని, ఫైళ్ళుగాని ఆఫీసు నుంచి బయటకి వెళ్ళరాదని వీరయ్య తెలిపారు.

బీజేపీ విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలి

● ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి

గుంటూరు, మార్చి 27: బీజేపీ కక్షపూరిత, కుట్రపూరిత, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. శారదాకాలనీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల సంఘటిత సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ కుటిల రాజకీయాలతో ఒక అనిశ్చిత వాతావరణం ఏర్పడిందని విమర్శించారు. దీన్ని అరికట్టాలంటే కాంగ్రెస్ పార్టీ మాత్రమే సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, భాగ్యరాజ్, ఉస్మాన్, రామకృష్ణ తదితరులున్నారు.

మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీగా పద్మజ

గుంటూరు(విద్య), మార్చి 27 : మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పద్మజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మహిళా ప్రాంగణం చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

డబ్బు కోసం కొడుకు, కోడల్ని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

గుంటూరు, మార్చి 27: స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్ ఒకటో లైనుకి చెందిన కొడుకు, కోడల్ని డబ్బుల కోసం వేధిస్తున్న మారం వీరయ్యపై కేసు నమోదైంది. వీరయ్యపై నగరంలోని అనేక పోలీస్‌స్టేషన్లలో క్రికెట్ బెట్టింగ్, సింగిల్ నెంబర్ లాటరీ తదితర కేసులు నమోదై ఉన్నాయి. ఈ క్రమంలో వీరయ్య అప్పుల పాల య్యాడు. దీంతో అప్పులు తీర్చాలంటూ గతంలో కొడుకు, కోడల్ని వేధించడంతో వారు రూ.20లక్షల అప్పులు తీర్చారు. తిరిగి అప్పులు చేసి అప్పులు తీర్చాలంటూ కొద్దిరోజులుగా విద్యానగర్లోని కొడుకు, కోడలు ఇంటికి వెళ్లి తలుపులు పగలగొట్టడం, దూషించడం బెదిరించడం వంటి ఘటనలకు పాల్పడుతున్నాడు. డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని కొడుకు, కోడల్ని బెదిరించడమే గాక ఆత్మహత్య చేసుకుంటానని కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండటంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వీరయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్‌కురాని వ్యక్తిపై చీటింగ్ కేసు

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేటకు చెందిన సూరిశెట్టి వీరశేఖర్ అనే వ్యక్తి తన స్థలాన్ని అమ్ముతానని చెప్పి గుంట హరిప్రసాద్ అనే వ్యక్తి వద్ద రూ.26 లక్షల 30 వేలు తీసుకొని వారి పేరిట అగ్రిమెంట్ కూడా రాసిచ్చాడు. పూర్తి పైకం పుచ్చుకున్న వీరశేఖర్ వారికి తన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్టర్ కార్యాలయం వరకు వెళ్లి చివరి క్షణంలో తనకు ఫోన్ వచ్చిందంటూ మాట్లాడుకుంటూ వచ్చేశాడు. ఆ తర్వాత తనకు స్థలం రిజిస్టర్ చేయమని హరిప్రసాద్ ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోకపోవడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు పట్టాభిపురం పోలీసులు వీరశే ఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గుంటూరు, మార్చి 27 : స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివనాగరాజు కాలనీలో అక్రమంగా ప్రభుత్వ మద్యం బాటిల్స్ విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పడాల వెంకటేశ్వర్లుని అరెస్టు చేసి సుమారు 10బాటిళ్ళు మద్యం స్వాధీనం చేసుకున్నారు.

● ప్రభుత్వ దుకాణంలో మాత్రమే విక్రయించాల్సి మద్యాన్ని అక్రమం గా విక్రయిస్తున్న నగరంలోని కాకానిరోడ్డులో గల షాప్ ఎంప్లాయీస్ కాలనీకి చెందిన కొండపురెడ్డి వెంకటరెడ్డిని నల్లపాడు పోలీసులు అరెస్టు చేసారు. నిందితుడు వెంకటరెడ్డి బుడంపాడు వద్ద మద్యం బాటిళ్లతో కూడిన ప్లాస్టిక్ గోతము కలిగి ఉండి ప్రభుత్వ లైసెన్స్ లేకుం డా మద్యం బాటిళ్లను ఎక్కువ ధరకు ప్రజలకు విక్రయిస్తున్నట్లుగా నల్లపాడు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు బుధవారం అతడిని అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచ నున్నట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు.

మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి వితరణ

గుంటూరు, మార్చి 27: గత ఏడాది మృతి చెందిన కానిస్టేబుల్ మున్నంగి కిశోర్ కుటుంబానికి ఉమ్మడి జిల్లాల 2009 సంవత్సరం బ్యాచ్ కానిస్టేబుల్స్ అండగా నిలిచారు. అందరూ కలసి రూ. 2,45,500 చెక్కును జిల్లా ఎస్పీ తుషార్ డూడి చేతుల మీదుగా కిషోర్ సతీమణి అయిన సుధారాణికి అందజేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీహరి రెడ్డి, సాంబశివరా వు, రాగం భాస్కర్, సుధాకర్ రెడ్డి, రవి కుమార్, విజయ్ కాంత్, వెం కట్, అశోక్ ప్రభాకర్, సుమన్, సాయి, రామకోటి, కరిముల్లా, సత్యం పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా మద్దతిస్తున్న ప్రజలు : మంత్రి రజనీ

గుంటూరు, మార్చి 27 : వచ్చే ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీదే విజయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని అన్నారు. నగరంలోని 25, 27 డివిజన్ల పరిధిలోని కేవీపీ కాలనీ సమీపంలో ఉన్న కొత్త కాలనీ, చుట్టుగుంట ప్రాంతాల నుంచి 70 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం మంత్రి సమక్షంలో వైసీపీలో చేరారు. మంత్రి రజిని వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తమకు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని, పరిపాలనను గతంలో రాష్ట్ర ప్రజలెవరూ చూడలేదని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైసీపీ అధ్యక్షులు, వైసీపీ నాయకులు ఉన్నారు.



పార్టీ కండువాతో వైసీపీలోకి మహిళలను ఆహ్వానిస్తున్న మంత్రి రజనీ

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), మార్చి 27 : స్థానిక ఆర్ అగ్రహారం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, యాగ పూర్ణాహుతిలను నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణ, దేవతోద్వాసనం, శ్రీ పుష్పయాగం, పూలంగి సేవ, సప్తవరణ సేవ, పవళింపు సేవ భక్తితో గావించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ఆలయ కార్యదర్శులు బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు పర్యవేక్షించారు.

శ్రీ లక్ష్మీ నారాయణస్వామి కల్యాణం

గుంటూరు(తూర్పు), మార్చి 27 : స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ 29వ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం శ్రీ లక్ష్మీనారాయణస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, వివిధ రకాల పుష్పాలతో, తులసీదళాలతో పుష్పాభిషేకం, లలితా సహస్రనామ పారాయణం జరిగాయి. శ్రీ విరుపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్య భారతీ మహాస్వామి నిర్వహణలో వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనారాయణ ఉత్సవమూర్తులకు దంపతులతో కల్యాణం, శాంతి హోమ మహాపూర్ణాహుతి నిర్వహించారు. విద్యారణ్య భారతీ మహాస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు మర్రిపాటి ప్రసాద్ పర్యవేక్షించారు.



మైనార్టీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గల్లా మాధవి

చంద్రబాబుతోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యం

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలకు సంబంధించి విద్య, ఉపాధి సహా అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలంటే అది చంద్రబాబు ద్వారానే సాధ్యమవుతుందని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి తెలిపారు. పశ్చిమ కార్యాలయంలో బుధవారం ఆమె ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని వార్డుల ముస్లిం, మైనార్టీ నాయకులు, కార్యకర్తల కష్టసుఖాలు తెలుసుకున్నారు. గల్లా మాధవి మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకునే బాధ్యత ముస్లిం మైనార్టీలపైన ఉందని అన్నారు. గుంటూరు పశ్చిమ స్థానంలో అన్నివేళలా అందుబాటులో ఉండి ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తనను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాధవి కోరారు. సీఏఏ సహా ఇతర ఏ విషయంలోనూ అపోహలు వద్దని, ఆరోపణలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ముస్లిం తమ్ముళ్లదేనన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు చంద్రబాబు రక్షణ కల్పిస్తారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, షేక్ లాల్ వజీర్, షేక్ చిన్న బాజీ, షేక్ నాగూర్, షేక్ మీరావలి, రుస్తుం బాబు, ఎండీ రఫీ, అస్మా, నాగూర్, నన్నే, సుభాని, గౌస్, జాఫర్, రబ్బాని పాల్గొన్నారు.

మా మద్దతు మాధవికే : మాస్టర్ మైండ్స్ మోహన్



మోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాధవి

ప్రముఖ విద్యాసంస్థలు, మాస్టర్ మైండ్స్ అధినేత మట్టుపల్లి మోహన్ తమ మద్దతు టీడీపీ పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవికేనని తెలిపారు. గల్లా మాధవి బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాధవిని ఆయన అభినందించారు. రాబోయే ఎన్నికల్లో తనకు సహాయ సహకారాలు తెలియజేయాలని మాధవి కోరగా మోహన్ సంపూర్ణ మద్దతు తెలిపారు. చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి ఐకాన్ అని, ఆయన ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో విద్యారంగంతో పాటు అన్ని రంగాలు ఆర్థికంగా అన్ని విధాలుగాను అభివృద్ధి చెందుతాయని ఈ సందర్భంగా ఆమె అన్నారు.

ట్రాన్స్‌జెండర్ల సమస్యలు పరిష్కరిస్తాం

● గుంటూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి పెమ్మసాని

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు 21వ డివిజన్ శ్రీనివాసరావుతోటలో పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ట్రాన్స్‌జెండర్లు ఆయనకు తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. గల్లా మాధవి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను గురించి ప్రజలకు తెలియజేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మౌలిక వసతులు, స్థానిక సమస్యలు తాను దగ్గర నుంచి పరిశీలించానని, వాటితో పాటు ప్రజలు తెలియజేసిన సమస్యలపై తాను గెలిచిన మరుక్షణం నుంచి దృష్టి సారించి పని చేస్తానని, వాటిని పరిష్కరిస్తామన్నారు. పెన్షన్లతో పాటు, ఇళ్ల స్థలాలు కూడా అందించడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, ఉగ్గిరాల సీతారామయ్య, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

జగన్ గ్యాంగ్‌ను తరిమికొట్టడానికి ప్రజలంతా సిద్ధం : నిమ్మల



డాక్టర్ నిమ్మల శేషయ్య

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జగన్ గ్యాంగ్‌ను ఎన్నికల్లో ఓడించి తరి మికొట్టడానికి ప్రజలంతా ఎప్పుడో సిద్ధమయ్యారని టీడీపీ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల తర్వాత ఎట్టకేలకు మేమంతా సిద్ధమంటూ ప్రజల మధ్యకు వస్తోన్న ముఖ్యమంత్రి జగన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్ధం సంగతేమో గానీ, ఐదేళ్లుగా పీడించుకుతింటోన్న జగన్, అతడి రౌడీ మూకల్ని తరిమికొట్టడా నికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆయన తేల్చి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, కూటమి అధికారంలోకి రావడం ఖాయమని డాక్టర్ నిమ్మల శేషయ్య ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమం, మరింత అభివృద్ధి దిశగా వైసీపీ సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా మూడు పార్టీల శ్రేణులు పని చేయాలని చెప్పారు. జగన్ పాలన మొత్తంలో ఒక వైసీపీ నాయకురాలు తన స్వార్థ ప్రయోజనాలు చూసుకున్నారు తప్ప, తన నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఇప్పుడు తానేదో వెలగబెడతానని గుంటూరు ప్రజలకు చెప్తున్నారని, ఎవరు నమ్మవొద్దని కోరారు.

దళితుల ఓట్లతో గెలిచిన దళిత వ్యతిరేకి జగన్ : బొల్లెద్దుల

గుంటూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): దళితుల ఓట్లతో నెగ్గిన దళిత వ్యతిరేకి జగన్మోహన్‌రెడ్డి అని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెద్దుల సుశీలరావు ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఎస్సీ సెల్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో దళితులపై దాడులు, దమనకాండలు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని, ముఖ్యమంత్రి ఏనాడు దళితులను ఓదార్చలేదని, దళితుల పక్షాన నిలవలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గుడిమెట్ల దయారత్నం, దాసరి రమణ, ఆదాం, పున్నారావు పాల్గొన్నారు.



మొదటి పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు

సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "డీజే టిల్లు' యువతను దృష్టిలో పెట్టుకొని తీసిన సినిమా. టిల్లు పాత్రను ప్రేక్షకులు హృదయాల్లో పెట్టుకున్నారు. అందుకే సీక్వెల్ అంటే మొదట భయపడ్డాను. 'టిల్లు స్క్వేర్' కోసం మా టీం అంతా శక్తికి మించి కష్టపడింది. మొదటి



పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు. ఈ సినిమాలో థ్రిల్లింగ్, షాకింగ్, సర్‌ప్రైజ్ అంశాలు చాలా ఉన్నాయి. మా నిర్మాత నాగవంశీ, త్రివిక్రమ్, చినబాబు గారికి ధన్యవాదాలు. నేనూ, అనుపమా కలసి ఉన్న పోస్టర్‌ను విడుదల చేసినప్పుడు కొందరు నెగెటివ్ కామెంట్స్ చేశారు. అమ్మాయిని అలా కామెంట్ చేయడం సరికాదు' అన్నారు. మల్లిక్‌రామ్ మాట్లాడుతూ "డీజే టిల్లు' లాగానే 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. సిద్ధుతో ఈ రెండేళ్ల ప్రయాణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని చెప్పారు. డీజే టిల్లూకన్నా ఈ చిత్రం నాలుగురెట్లు వసూళ్లు సాధించాలని దర్శకుడు వెంకీ అట్లూరి ఆకాంక్షించారు. సిద్ధూ ఎనర్జీ లాస్ట్ ఫ్రేమ్ వరకూ ఓ రేంజ్‌లో ఉంటుంది, ఈ సినిమా కూడా సూపర్ హిట్ అవుతుందని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ తెలిపారు. సిద్ధూ ఎనర్జీ మైండ్ బ్లోయింగ్, పార్ట్ 2 డబుల్ బొనాంజా అవుతుంది అని దర్శకుడు బాబీ చెప్పారు. చిత్రబృందం సక్సెస్ పార్టీకి సిద్ధంగా ఉండాలని నీరజ కోన కోరారు.

మా అమ్మాయని రికమెండ్ చేయలేదు




మా అమ్మాయి మాళవిక మోహనన్‌ను నేనేమీ రికమెండ్ చేయలేదు. తనకు తానే గుర్తింపు తెచ్చుకుంది. నా ప్రమేయం లేకుండా నటిగా ఆమె నిరూపించుకోవాలి. ప్రస్తుతం తను విక్రమ్‌తో నటిస్తున్న 'తంగలాన్' మూవీ మంచి గుర్తింపు తెస్తుంది" అని ప్రముఖ ఛాయాగ్రాహకుడు, హీరోయిన్ మాళవికా మోహనన్ తండ్రి కె.యు మోహనన్ చెప్పారు. ప్రస్తుతం తను సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేసిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా గురించి మాట్లాడుతూ "ఇది ఒక బ్యూటిఫుల్ మూవీ. ఒక మిడిల్ క్లాస్ వ్యక్తి తన ఫ్యామిలీ కోసం ఏం చేశాడనేది మంచి మెసేజ్‌తో చూపించాం. మంచి లవ్ స్టోరీతో పాటు మనం నిర్లక్ష్యం చేస్తున్న కుటుంబ విలువలను తిరిగి గుర్తు చేసేలా ఉంటుంది" అన్నారు.

పెద్ద విజయాన్ని సాధించాలి



విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్‌లు నిర్మించారు. ఈ నెల 29న విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సుమన్, నిర్మాత ఏ.ఎం రత్నం అతిథులుగా విచ్చేశారు. సుమన్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి" అని కోరుకున్నారు. నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ "టైటిల్ కొత్తగా ఉంది" అని చెప్పారు. డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ మెప్పిస్తుంది" అని చెప్పారు. "సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని నిర్మాతలు అన్నారు. విశ్వ కార్తికేయ మాట్లాడుతూ "డిఫెరెంట్ కాన్సెప్ట్‌తో వస్తోన్న ఈ చిత్రం మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది" అని చెప్పారు.



రామ్‌చరణ్, కియారా జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి జరగండి జరగండి అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. అనంత్ శ్రీరామ్ సాహిత్యానికి తమన్ స్వరాలు సమకూర్చారు. దలేర్ మెహందీ, సునిధీ చౌహాన్ ఆలపించారు.

ఒక్కటైన సిద్ధార్థ్, అదితి




హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అది తీరావు హైదరీల వివాహం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ లోని రంగనాథ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం జరిగింది. తమిళనాడు నుంచి వచ్చిన పురోహితులు వివాహ తంతును జరిపించారు. వివాహ కార్యక్రమం మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు స్థానిక పూజారులను కానీ, ఆలయ సిబ్బంది, స్థానికులను ఎవరినీ లోపలికి అనుమతించలేదు. అనుమతించిన కొద్దిమంది సెల్‌ఫోన్లను కూడా తీసుకున్నారు. వివాహ కార్యక్రమం పూర్తయిన వెంటనే వనపర్తి పట్టణంలోని వాసుదేవమ్మ తోటలో విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ తోట వనపర్తి సంస్థానాదీశులది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాదీశుల్లో చివరిరాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనమరాలు. ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. వనపర్తి సంస్థానాదీశుల కాలంలో నిర్మించిన శ్రీరంగాపూర్ రంగనాథ స్వామి ఆలయం ఇప్పటికీ సంస్థానాదీశుల ట్రస్టు ఆధీనంలోనే ఉండడంతో పెళ్లితంతును రహస్యంగా నిర్వహించగలిగారని చెప్పవచ్చు. హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితిరావు హైదరీ కలసి 'మహాసముద్రం' సినిమాలో నటించారు. ఆ సమయంలోనే వీరిమధ్య ప్రేమ చిగురించింది. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని, 2012లో విడిపోయారు.

– మహబూబ్‌నగర్ (ఆంధ్రజ్యోతి)











పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, రామచంద్రరావు తదితరులు

అందరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట మార్చి 27: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్విని యోగం చేసుకోవాలని కోవాలని మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం భారత ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు, రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వీప్ (ఎస్‌వీఇఇపీ)లో భాగంగా ప్రజలకు మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఓటు వినియోగంపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరూ విలువైన మీ ఓటును వినియోగించుకొని, స్వచ్ఛందంగా, ఎటువంటి ప్రలోభావాలకు లోనుకాకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. తద్వారా మంచి ప్రభుత్వాన్ని దేశానికి అందించిన వారవుతారని అన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, అసిస్టెంట్ సిటీప్లానర్లు జడ్ సుధాకర్, ఎస్ఎల్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏ రామచంద్రరావు, డి.శ్రీనివాస రావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రావు

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం

తెనాలి అర్బన్, మార్చి 27: గాంధీనగర్‌లోని ఇప్టాఫ్ కార్యాలయంలో బుధవారం ప్రపంచ రంగస్థల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రచయిత, దర్శకుడు బీవీ రావు మాట్లాడుతూ, ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ వారు ప్రతి మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవంగా జరుపుకునేందుకు ప్రతిపాదనలు తెచ్చి ఆచరణలో పెట్టారని చెప్పారు. ఫ్రాన్స్ దేశానికి చెందిన జిన్‌కాక్‌టో అంతర్జాతీయ స్థాయిలో రంగస్థల దినోత్సవానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. సమాజంలో ప్రజలను చైతన్యపరిచేందుకు కళలను కళాకారులను ఆదరించేందుకు రంగస్థలం దోహదపడుతుందన్నారు. ప్రకాష్, రమేష్, బెల్లంకొండ వెంకట్, వసంత యామిని, మధుకర్, కృష్ణ, రామారావు ప్రసంగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణరావు, తదితరులు

వైసీపీ అధికార మదానికి నిదర్శనం అర్చకుడిపై దాడి

● రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

తెనాలి రూరల్, మార్చి 27: వేద మంత్రాలతో నిత్యం భగవంతుని సేవ చేసే అర్చక స్వామిపై దాడిచేశారంటే వైసీపీ అధికార మదానికి ఇంతకన్నా నిదర్శనం మరొకటిలేదని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు తాడేపల్లి సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘం, టీడీపీ ఆధ్వర్యంలో కాకినాడలో అర్చకస్వామిపై జరిగిన దాడిని ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల కాకినాడ అర్చకుడిపై వైసీపీ నేతలు అధికారమదంతో ఇష్టానుసారంగా దాడిచేసి బూతులతో దూషించడాన్ని తెలుగుదేశం పార్టీ తరుపున, బ్రాహ్మణ వేదిక్ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అర్చకుడిపై దాడిచేసి చివరికి క్షమాపణ చెప్పి సరిపుచ్చుకుందామనుకోవడం వైసీపీ నాయకులకు పరిపాటిగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో అర్చకులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని గతంలో కర్నూలులో, కోటప్పకొండలో ఇలా పలుచోట్ల దాడులు జరిగాయని గుర్తుచేశారు. ఈ దాడులను అరికట్టడంలో అందుకు కారకులైన నిందితులను శిక్షించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా అర్చకుడిపై జరిగిన దాడికి కారకులైన నిందితులను వెంటనే అదుపులోకి తీసుకుని అతడిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని కఠినశిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ జూటూరి సత్యం మాట్లాడుతూ అర్చకులపై దాడి అందరూ ఖండించదగ్గ విషయమన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ నాయకులు మాత్రం దాడుల సంస్కృతి మానడంలేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఇటువంటి దాడులకు తగిన గుణపాఠం చెప్పి తీరేలా ప్రజలు సిద్ధమవుతున్నారని మరెంతో కాలం ప్రభుత్వం నిలబడదన్నారు. దాడికి కారకులైన వారిని తక్షణమే పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యాసాగర్, చంద్రమోహన్, అచ్చాయమ్మ, దిలీప్, సుధామాధవి, దంటుకామేశ్వరి, ప్రసాదరావు, సుబ్రహ్మణ్యం పలువురు నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్ప యాగోత్సవం

మంగళగిరి సిటీ, మార్చి 27: మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి బుధవారం ఉదయం శ్రీపుష్ప యాగోత్సవం నిర్వహించారు. పదకొండు రోజుల పాటు సాగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముగింపుగా దిగువ సన్నిధిలోని శ్రీకృష్ణదేవరాయ ముఖమండపంలో ఈ ఉత్సవం జరుపుతారు. స్వామివార్లను వివిధ రకాల పుష్ప సౌరభాలతో సేదతీర్చి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత నృసింహస్వామి వార్లతో ఆలయ ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. ఈ ఉత్సవానికి నందం సాంబశివరావు, శాంతకుమారి దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.రామకోటి రెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి ఆస్థాన అలంకారోత్సవాలు

దిగువ సన్నిధిలో ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు ఆస్థాన అలం కారోత్సవాలు జరుగనున్నాయి. రోజు సాయంకాలం వివిధ రూపాల్లో నృసింహ స్వామి భక్తులకు దర్శనమిస్తారు. 28న మత్స్యావతారం, 29న వటపత్రశాయి, 30న రుక్మిణీ హరణం, 31న గోవర్ధనోద్ధరణ, ఏప్రిల్ ఒకటిన గజేంద్ర మోక్షం, 2న పార్థసారథి, 3న శ్రీరంగనాయకులు, 4న రుక్మిణీ కల్యాణం, 5న స్తంభోద్భ వం, 6న కాళీయ మర్దనం, 7న పరమపద నాథుడు, 8న ఉదయం శ్రీరామ పట్టాభిషేకం, సాయంత్రం కోదండరాముని అలంకారంలో దర్శనమిస్తారు. 9న ఉగాది తిరువంజనోత్సవం, శాంతి కల్యాణం, అదేరోజు మధ్యాహ్నం పంచాంగ శ్రవణం, సాయంత్రం బంగారు గరుడోత్సవం, రాత్రికి అద్దాల మహల్‌లో స్వామివారి పవళింపు సేవ జరుగుతాయని నిర్వహకులు తెలిపారు.

ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



సమావేశంలో మహిళలతో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

చేబ్రోలు, మార్చి 27: ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రతి మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని అందించి లక్షాధికారులను చేయటమే లక్ష్యం అన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండలపరిధిలోని వేజండ్ల గ్రామంలో బుధవారం నరేంద్రకుమార్ మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు పెద్దసంఖ్యలో హాజరై తమ సమస్యలను వివరించారు. ధూళిపాళ్ల మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ పథకాన్ని వర్తింప చేసినట్లు గుర్తు చేశారు. ఐదు లక్షల పరిమితిని వైసీపీ ప్రభుత్వం మూడు లక్షలు తగ్గించటం వల్ల మహిళలు పథకానికి దూరమైనట్లు ఆరోపించారు. వైఎస్సార్ హయాంలో ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాన్ని ఆయన తనయుడు జగన్‌రెడ్డి నిర్వీరియం చేశారన్నారు. ముస్లింలకు ఎట్టువంటి ఆంక్షలు లేకుండా దుల్హన్ పథకాన్ని ప్రవేశపెట్టి రూ.50 వేలు అందించినట్లు గుర్తు చేశారు. రానున్న ఎన్డీఏ ప్రభుత్వంలో మహిళలకు సూపర్ 6 పథకాలు అమలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు మహాశక్తి పథకం ద్వారా నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, యాడాదికి మూడు సిలెండర్లు ఈ పథకం ద్వారా ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. అలాగే గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రాధానం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

7వ వార్డు, జూపూడి, మన్నవలో ధూళిపాళ్ల ప్రచారం

పొన్నూరుటౌన్, మార్చి 27: టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే కాల్వ కట్టవాసుల సమస్యలు పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే, సంగండెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని 7వ వార్డు ఆలూరు కాల్వకట్టపై నరేం ద్రకుమార్ పర్యటించి స్థానికులను కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలపరిధిలోని జూపూడి మన్నవ గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి స్థానికులను కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లో నరేంద్రకుమార్ మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు మంచి నీటి సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ హయాంలో నిడుబ్రోలులో నిర్మించిన ఎన్టీఆర్ కాలనీలో పేదలకు పక్కా గృహాలు అందచేస్తే వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా లబ్దిదారులకు ఇవ్వకుండా వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. పలువురు లబ్ధిదారులకు గృహాలు మంజూరై గృహాలపై బ్యాంకులు రుణాలు ఇచ్చాయన్నారు. ప్రభుత్వ నిర్వాహకం వల్ల గృహం అందక రుణాలు చెల్లించలేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో కాల్వ కట్టల వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నింటిని పరిష్కరించనున్నట్లు చెప్పారు. మండలపరిధిలోని జూపూడి మన్నవ గ్రామాల్లో పర్యటించిన నరేంద్రకుమార్ వారి సమస్యలపై మాట్లాడుతూ గ్రామాల్లో ఐదేళ్లలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. ప్రజలు మౌళిక వసతుల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



7వ వార్డు ఆలూరు కాల్వ కట్టపై పర్యటిస్తున్న నరేంద్రకుమార్

రాష్ట్ర సంక్షేమం కోసమే పొత్తులు

● జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, మార్చి 27: పొత్తుఅనేది పదవి కోసమో..సీటు కోసమో కాదని వైసీపీ పాలనలో రాష్ట్రానికి నష్టం జరిగింది కాబట్టి రాష్ట్ర సంక్షేమాన్ని, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులు పెట్టుకుని పోటీ చేయాల్సి వస్తుందని జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుంచవరం, అత్తోట కమతంవారిపాలెం, దంతలూరు, అత్తోట యాదవపాలెం, సిరిపురం గ్రామాల్లో పర్యటించి టీడీపీ నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రం కోసం, ప్రజల కోసం ఉమ్మడిగా పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబునాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం అవసరమన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కొల్లిపర మండలాన్ని అభివృద్ధిలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపానన్నారు. అంతేకాకుండా ఆనాడు తాగునీటి కొరత తీర్చేందుకు కోట్లాది రూపాయలతో రక్షిత తాగునీటి పథకాన్ని తీసుకువచ్చి పైపులైన్లు ద్వారా నియోజకవర్గ ప్రజలకు అందించామన్నారు. వ్యవస్థలో నిర్మాణం చేసుకోలేక, చేతకాకపోవటంతో యువత దూరప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇక్కడ ఉన్న వాతావరణాన్ని బట్టి పరిశ్రమలు ఏర్పాటుచేయటానికి పెట్టుబడి పెట్టడానికి ఎవరూ ముందుకు రావటం లేదన్నారు. రాబోయే రోజుల్లో ఆ పరిస్థితి ఉండదన్నారు. గతంలో అట్టడుగు స్థాయిలో ఉండి మౌళిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు వేసి రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. మరలా అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్న అభ్యర్థులను రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా పెమ్మసాని చంద్రశేఖర్ సేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి వచ్చారని అటువంటి వ్యక్తులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, తెలుగురైతు కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ, జనసేన నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, ఆళ్ళ వీరారెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, దాసరి నరసయ్య, దర్శి జీవరత్నం, బొద్దులూరు అశోక్, పోపూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో మహిళలకు ఘోరంగా అవమానం

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ కరీముల్లా



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ, జనసేన నాయకులు

పొన్నూరుటౌన్, మార్చి 27: ముస్లిం మహిళను చెప్పుతో కొట్టి అసభ్య పదజాలంతో దూషించి వైసీపీ మహిళా లోకాన్నే ఘోరంగా అవమానించారని జనసేన పట్టణ అధ్యక్షుడు షేక్ కరీముల్లా ఆరోపించారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన నాయకుల ఉమ్మడి సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బుల్ అహ్మద్ ప్రచారానికి జనం రాకపోవటంతో వహీద అనే మహిళను ప్రచారానికి మహిళలను తీసుకురావాలని ఆదేశించారన్నారు. వహీదా ఎక్కువ మంది జనాన్ని తీసుకువచ్చి వారికి కూడా డబ్బు చెల్లించాలని అడగటంతో ఎమ్మెల్యే అభ్యర్థి బంధువు వహీదాను అసభ్యంగా దూషించటంతోపాటు ఆమెపై చెప్పుతో దాడి చేయటం సభ్య సమాజం హర్షించబోదన్నారు. బాధిత మహిళ ఫిర్యాదును కూడా పోలీసులు తీసుకోకపోవటం దారుణం అన్నారు. పొన్నూరులో ముస్లిం మైనార్టీలపై జరిగిన దాడులను గుర్తు చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే స్థానిక ముస్లిం వైసీపీ నాయకులకు, వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న దాడులు కళ్లకు కనిపించటం లేదా అన్ని ప్రశ్నించారు. నారాకోడూరులో మార్కెట్ యార్డు ఉద్యోగి బాషాని లారీతో గుద్దించి చంపితే కళ్లకు కనపడలేదా అన్ని నిలదీశారు. చేబ్రోలు కొత్తరెడ్డిపాలెంలో దివ్యాంగుడైన మైనార్టీని వైసీపీ నాయకుడు పచ్చడి బండతో కొట్టి చంపితే ఈ నాయకులు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. కర్నూలు అబ్దుల్ కలామ్ కుటుంబం అంతా ఆత్మహత్య చేసుకుందని, చిత్తూరులో నిస్స అనే బాలిక వైసీపీ అరాచకాలను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నప్పుడు మాట్లాడని నాయకుల నోర్లు ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నాయని నిలదీశారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సభలో మాట్లాడిన మాటలు బాధిస్తే క్షమించాలని చెప్పిన తర్వాత కూడా వైఈపీ మైనార్టీ నాయకులు రాద్ధాంతం చేయటం తగదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న ముస్లిం మైనార్టీలపై అఘాయిత్యాలను ప్రశ్నించి ముస్లిం సమాజంపై వారికి ఉన్న చిత్తశుద్ధిని చూపించుకోవాలని సవాళ్లు విసిరారు. ముస్లింలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు కనిపించని వైసీపీ మైనార్టీలకు కేవలం ప్రచారంలో అన్న మాటలే ఎందుకు పెద్దగ కనిపిస్తున్నాయని ప్రశ్నించారు. ముస్లిం సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్, పఠాన్ ఫిరోజ్ ఖాన్, షేక్ బాబ్జి, షేక్ బాజి సాహెబ్, జానీ బేగ్, కరీముల్లా బాజీ, ఇస్మాయిల్, సిలార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జగన్ అరాచక పాలనతో ప్రజలు విసుగెత్తారు

● బలహీన వర్గాలపై పెరిగిన దాడులు, దౌర్జన్యాలు
● ప్రజలంతా చైతన్యవంతులై ఓటుతో బుద్ధి చెప్పాలి
● చేనేత, స్వర్ణకారుల సమస్యలు పరిష్కరిస్తాం
● మంగళగిరిలో పెమ్మసాని విస్తృత ప్రచారం



పెమ్మసానికి స్వర్ణకారుల సమస్యలు వివరిస్తున్న సత్యకృపాల్ డాంగే

మంగళగిరి సిటీ, మార్చి 27: అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ ప్రభుత్వం చేస్తున్న అరాచకపాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని గుంటూరు పార్లమెంటు ఉమ్మడి కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన మంగళగిరిలో విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని షరాబ్ బజారులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి నివాస గృహాలు, వర్తక, వాణిజ్య సముదాయాలకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. స్వర్ణకారులు, చేనేత వ్యాపారులు, ముఠా కూలీలు, వర్తక, వ్యాపారులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ మాదిరిగానే ఆ పార్టీ నాయకులూ అరాచకాలు సృష్టిస్తున్నారని చెప్పారు. వైసీపీ నేత భూదాహానికి ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన ఓ చేనేత కుటుంబం బలైపోయిందన్నారు. కాకినాడలోని ఓ శివాలయంలో అర్చకుడిపై వైసీపీ నేత దాడి చేయడం అత్యంత బాధాకరమన్నారు. కదిరిలో ముస్లిం మహిళపై దాడికి తెగబడ్డా రని చెప్పారు. ఇలా చెప్పుకుంటే పోతే ప్రతిరోజు అనేక చోట్ల వైసీపీ నేతల వేధింపుల పర్వం కొనసాగుతుందని తెలిపారు. ప్రజలంతా చైతన్యవంతు లై రాబోయే ఎన్నికల్లో వైసీపీ అరాచక ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పా లని పిలుపునిచ్చారు. మంగళగిరిలో ప్రజలు అనేక సమస్యలను తన దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. మంగళగిరి ప్రాంత సమస్యలన్నీం టినీ తెలు సుకున్నానని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చేనేతలు, స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మి శెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, గుంటూరు పార్ల మెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనరు పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కాండ్రు భానుకిషోర్, జగ్గారపు శ్రీని వాసరావు, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి మారుతీరావు, కాప రౌతు సుందరయ్య, ఖైరుల్లా, టీడీపీ నేతలు కాండ్రు శ్రీనివాసరావు, మన్నెం రమేష్‌బాబు, వింజమూరి ఆషాబాల, గుత్తికొండ ధనుంజయరావు, గోవాడ దుర్గారావు, కారంపూడి అంకమ్మరావు, సంకా బాలాజీగుప్తా, మండ్రు రాము, పడవల మహేష్, కందుల నాగార్జున, గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాసరావు, జొన్నాదుల బాలకృష్ణ, జంజనం వెంకట సుబ్బారావు, మున్నంగి శివశేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో హుండీల లెక్కింపు

● రూ.52.70 లక్షల ఆదాయం

పెదకాకాని, మార్చి 27: పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో బుధవారం కానుకల హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఉపకమిషనరు, కార్యనిర్వాహణాధికారి దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా పాత గుంటూరు అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ శ్రేణి కార్య నిర్వహణాధికారి ఎస్ఎల్‌టీ సౌమ్య పాల్గొన్నారు. ఆమె పర్యవేక్షణలో ఆలయ కల్యాణ మండపం నందు లెక్కించారని తెలిపారు. దేవస్థానానికి గడిచిన 96 రోజుల హుండీ ఆదాయం రూ.52,70,371ల నగదు, అన్నదానం రూ.79,370లు, బంగారం 11 గ్రాములు 500 మిల్లీ గ్రాములు, వెండి 705 గ్రా 500 మిల్లి గ్రాములు ఆదాయం వచ్చినదని దేవస్థాన ఉపకమిషనరు, కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

వైకుంఠపురం ఆదాయం రూ.20 లక్షలు

తెనాలి అర్బన్, మార్చి 27: వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామికి మూడు నెలల్లో 20లక్షల 22వేల304ల ఆదాయం లభించింది. బుధవారం ఆలయ హుండీ లెక్కించారు. ఛైర్మన్ కంభం సాయిబాబు, ఈవో అమర్‌నాథ్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో సభ్యులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

రాజకీయాలకు దూరంగా మా ఏపీ: దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, మార్చి 27: మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాలకు దూరంగా ఉంటుందని సంస్థ వ్యవస్థాపకులు దిలీప్‌రాజా చెప్పారు. పెదరావూరులోని స్టూడియోలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు కోరినప్పటికీ ప్రచారానికి దూరంగా ఉండాలన్నారు. మా ఏపీలో సభ్యులంతా తమకు ఇష్టమైన పార్టీలకు ఓటు చేసుకునే స్వేచ్ఛ ఉందన్నారు. దీనిలో ఎవరి ఒత్తిడి ఉండదన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎన్నికల బరిలో దించడానికి కొందరు చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టామన్నారు. ఎవరు గెలిచినా మా సంస్థకు ఒక్కటేనన్నారు. సమావేశంలో సభ్యులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తెనాలి క్రైం, మార్చి 27 : పట్టణంలోని చినరావూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడు ఆర్థిక సమస్యలతో, భార్యభర్తల మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెనాలి రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చినరావూరుకు చెందిన ఎం గోపీకృష్ణ (28) బుధవారం మధ్యాహ్నం తెనాలి నుంచి రేపల్లె వెళుతున్న ట్రైన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చినరావూరు రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. కుటుంబంలో భార్యాభర్తల వివాదాలు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి రైల్వే పోలీసులు తెలిపారు.

అంతరాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీలు



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీలు

ప్రత్తిపాడు, మార్చి 27: ప్రత్తిపాడు మండలం నడింపాలెం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్ పోస్టును కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడిలు ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ సరళిని వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి వాహనాన్ని తప్పకుండా తనిఖీ చేయాలని వారు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్, డీఎస్‌పీ మహబూబ్ బాషా, ప్రత్తిపాడు సీఐ నిస్సార్ బాషా, ఎస్ఐ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిన వైసీపీ

● నియోజకవర్గ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), మార్చి 27: సంక్షేమాన్ని వైసీపీ గాలికొదిలేసిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కూటమి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్, బొంతపాడు గ్రామంలో బుధవారం శంఖారావం సూపర్ 6 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నా రు. ఈ సందర్భంగా కూటమి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరుతుందని స్థానికులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, ఇమ్మడి మల్లికార్జునరావు, గంధం సురేష్, సోమవరపు చలమయ్య, ఉగ్గిరాల సీతారామయ్య, మార్కేండేయులు, నిశ్శంకర రావు నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, చినబాబు, అశోక్, విజయ్‌కుమార్, రాజు, ఏసోబు, 16వ డివిజన్ కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గావాసు తదితరులు పాల్గొన్నారు.